క్లుప్తంగా

శివశంకర్ జయంతి



కమలాపూర్ : కేంద్ర మాజీ మంత్రి పుంజాల శివశంకర్ 95వ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద శివశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు చరణ్‌పటేల్ మాట్లాడుతూ.. అత్యంత పేదరికం నుంచి వచ్చిన శివశంకర్ న్యాయ విద్యను అభ్యసించి జస్టిస్‌గా ఎదగడమే కాకుండా భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మంత్రి వర్గంలో అనేక మంత్రి పదవులు చేపట్టారని అన్నారు. దేశ వ్యాప్తంగా ఓబీసీలకు, రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాడని, న్యాయ రంగంలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టి బీసీలకు సముచిత ప్రాధాన్యం కల్పించిన గొప్ప నాయకుడు శివశంకర్ అని కొనియాడారు. తడక శ్రీకాంత్, మాట్ల రవీందర్, రవి, నారాయణరెడ్డి, శ్రీనివాసరావు, సదానందం, కృష్ణ, ప్రసాద్, డాక్టర్ కుమారస్వామి, రాజిరెడ్డి, కృష్ణమూర్తి, లింగయ్య, వెంకట్రాజం, శ్రీనివాస్, వీరన్న, తిరుపతి, రాజు, మణీశ్, చంద్రశేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



శాయంపేట : గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దకోడెపాక గ్రామ శివారులో శనివారం పరకాల ఎక్సైజ్ పోలీసులు రూట్‌వాచ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో గంగిరేణిగూడెం నుంచి పెద్దకోడెపాకకు ద్విచక్ర వాహనంపై వస్తున్న గుగులోతు రాజు 20 లీటర్ల నాటుసారాతో పట్టుబడినట్లు తెలిపారు. నాటుసారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాజును అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై సులోచన. కానిస్టేబుల్ అఖిల్‌కుమార్ పాల్గొన్నారు.

'కడియం' పరామర్శ



వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన గంగాపురం మహేశ్, లేకుంట్ల భద్రయ్య, జక్కుల ఐలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అండగా ఉంటానని భరోసా కల్పించారు. మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, కుడా మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్దాం హుస్సేన్, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

నియామకం



కమలాపూర్ : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని పంగిడిపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాలపురి కనుకరత్నాన్ని నియమించినట్లు ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కనుకరత్నం మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, సహకరించిన మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్, మండల కాంగ్రెస్ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన వడ్డెపల్లి రాజపోచయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందాడు. కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మోత్కూరి భాస్కర్, నాయకులు మడికొండ రాజు, ఎక్కెళ్లి మల్లేశ్, నాగరాజు బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.2వేల ఆర్థికసాయం అందించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఆకుతోట సమ్మిరెడ్డి, సీనియర్ నాయకుడు రమేశ్, మాజీ వార్డు సభ్యులు చరణ్, రాజేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తరాలు మారినా.. తరాజులు మారట్లే

- తుప్పపట్టిన బాట్లతో తూకాలు
- కిలోకు 200 గ్రాముల నుంచి 300 గ్రాములు కోత
- పరకాల చేపల మార్కెట్‌లో కొందరు వ్యాపారుల మోసం
- నిద్రమత్తులో తూనికల శాఖ



పరకాల పట్టణంలోని కూరగాయల మార్కెట్

హన్మకొండ (పరకాల) : రోజురోజుకూ సాంకేతికత రూపాంతరం చెందుతున్నా.. ఆ మార్కెట్‌లో మాత్రం తరాల నాటి తరాజులు, బాట్లతో తూకాలు వేస్తూ కొనుగోలుదారులకు కుచ్చుటోపి పెడుతున్నారు. నిఘా ఉంచి చర్యలు తీసుకోవాల్సిన తూనికలు, కొలతల శాఖ అధికారులు నిద్రమత్తు వీడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరకాల పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో బేరం చేసి కొనుగోలు చేసిన వినియోగదారులూ.. ఇంటికి వెళ్లే వరకు తాము మోసపోయామని గ్రహించలేకపోతున్నారు. కూరగాయల మార్కెట్, సమీపంలోని చేపల మార్కెట్‌లో జరుగుతున్న మోసాలపై తూనికలు, కొలతల శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కూరగాయల మార్కెట్‌తోపాటు చేపల మార్కెట్‌లోని వ్యాపారస్తుల వద్ద కొత్త బాట్లు కనిపించకపోగా.. పాత బాట్లతో తూకం వేయడంతో కిలోకు 200 గ్రాముల నుంచి 300 గ్రాముల వరకు కోత విధిస్తున్నట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఏవరైనా గమనించి ప్రశ్నిస్తే ఎదురు సమాధానాలు చెబుతూ దబాయింపు చర్యలకు దిగుతున్నట్లు సమాచారం. మా కాంటాలు ఇలాగే ఉంటాయి, ఏం చేసుకుంటారో చేసుకోండి, మాకేం కాదు, మేం ఇలాగే చేస్తామని కొందరు చేపల వ్యాపారస్తులు వినియోగదారులపై దురుసుగా వ్యవహరించడం పరకాల మార్కెట్‌లో సాధారణమైందని వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా తమకు ఏకం కాదంటూ వినియోగదారులనే బెదిరిస్తున్నట్లు తెలిసింది.

జాడలేని తూనికలు, కొలతల శాఖ



తక్కువ తూకం కారణంగా గొడవపడుతున్న వినియోగదారులు



అనుమానంతో ఎలక్ట్రానిక్ కాంటాతో తూకం వేస్తున్న వినియోగదారులు



చేపల మార్కెట్‌లో తప్పుపట్టిన తరాజు, బాట్లు

పరకాల కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్‌లో తరాజుల తూకంతో వినియోగదారులు మోసపోతున్నట్లు తెలిసినా సంబంధిత తూనికలు, కొలతల శాఖ పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఏడాది, రెండేళ్లకోసారి తూ..తూ మంత్రంగా కొన్ని దుకాణాల్లో తనిఖీలు చేపట్టి రెండు, మూడు కేసులు నమోదు చేసి మమ అనిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముడుపులు ముట్టడం వలనే మార్కెట్‌లో అన్యాయం జరుగుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

చర్య తీసుకోవాలి

పరకాల కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్‌లో జరుగుతున్న కాంటా మోసాలపై అధికారులు చర్యలు తీసుకోవాలి. లేకపోతే వినియోగదారుడికి రోజురోజుకు అన్యాయం జరుగుతుంది. తాము మోపోయినట్లు తెలిసిస్తే ఆధారాలతో వినియోగదారుల ఫోరంలో వినియోగదారులు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి. సదరు వ్యాపారిపై చర్యలు తీసుకోబడుతాయి. వ్యాపారులు కూడా నిబంధనలు పాటించాలి. ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదు.

\- రాజేందర్, యాక్ వరంగల్ రీజినల్ కన్వీనర్

కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని కళ్లుతెరిచి చూడండి

- మండలాధ్యక్షుడు బుచ్చిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి

శాయంపేట : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కళ్లు తెరిచి చూడాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా ఐదేళ్లు అధికారం అనుభవించి ఓటమి తర్వాత సొంత కార్యకర్తలను కలిసి భరోసా ఇవ్వలేని వెంకటరమణారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన ఎనిమిది నెలల్లోనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసిందన్నారు. గత ప్రభుత్వం లక్ష రుణమాఫీని నాలుగు విడుతలుగా మాఫీ చేయడంతో కేవలం వడ్డీకే సరిపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఏకకాలంలో రూ. 1లక్షల 50వేల రుణమాఫీ చేసిందన్నారు. సాంకేతిక సమస్యలు ఉన్నవారికి సైతం పరిష్కారం చేస్తుంటే అవగాహన లేకుండా మాజీ ఎమ్మెల్యే మాట్లాడడం సబబు కాదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని కార్పొరేట్ వ్యవసాయానికి, భూస్వాములకు అందించిందని, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి రైతు భరోసా పథకం అమలుపై రైతుల అభిప్రాయాలను సుకరించి విధి విధానాలు ఖరారు చేస్తున్నారని అన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. లేనిపోని విమర్శలు చేయొద్దని కోరారు. నాయకులు చిందం రవి, రమేశ్, రాజేందర్, ప్రపంచరెడ్డి, రాజు, కుమారస్వామి, రవీందర్, జగన్, చిరంజీవి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



మాట్లాడుతున్న సీఐ సంతోశ్

ఆత్మకూరు : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించడం అలవర్చుకోవాలని సీఐ సంతోశ్ అన్నారు. మండలంలోని గుడెప్పాడ్ ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం తప్పనిసరి అన్నారు. రోజురోజుకు కాలుష్యం పెరిగిపోతుందని, కాలుష్యాన్ని నిర్మూలించడం పచ్చని చెట్లతోనే సాధ్యమన్నారు. విద్యార్థులు లక్ష్యంగా ఎంచుకుని విద్యనభ్యసించాలని అన్నారు.

మత్తు పదార్థాలు ప్రాణాంతకం : ఎక్సైజ్ సీఐ



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్

వేలేరు : గంజాయి, ఇతర మత్తు పదార్థాలు ప్రాణాంతకమని కాజీపేట ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్, ప్రముఖ సైక్రియాటిస్టు డాక్టర్ ప్రహర్షిత్ అన్నారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ రౌతు అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గంజాయి, ఇతర మత్తు పదార్థాలతో జరిగే అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, మత్తు మాయలో పడొద్దని అన్నారు. ఎక్కడైనా గంజాయి సరాఫరా అవుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మమత, వైస్ ప్రిన్సిపాల్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- టీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష అభ్యర్థి రాజ్‌కుమార్



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

శాయంపేట : చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోకుండా, వారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్ష అభ్యర్థి వలకటి రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో శనివారం సంఘం మాజీ చైర్మన్ బాసాని చంద్రప్రకాశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రామ శ్రీనివాస్ 50వేల సభ్యత్వాలతో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘాన్ని పటిష్టం చేశారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరపడం వలన నాయకులకు తగిన గుర్తింపు లభిస్తోందన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున పద్మశాలి కుల బాంధవుల శాశ్వత భవన నిర్మాణం కోసం కృషి చేస్తానని, 50ఏళ్లు దాటిన చేనేత కార్మికులకు పెన్షన్లు అందజేస్తామని, టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. 18వ తేదీన జరిగే ఎన్నికల్లో మగ్గం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు శరత్‌బాబు, మల్లయ్య, సుధాకర్, అడక్ కమిటీ సభ్యులు బాలరాజు, సొసైటీ పీఏసీ చైర్మన్ శంకర్‌లింగం, పీఏసీ సభ్యుడు లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ రవి, పద్మశాలీలు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

దర్వాజ ప్రతిష్ఠాపనను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు

దామెర: మండల కేంద్రంలో ఆదివారం పోచమ్మ ఆలయ దర్వాజ ప్రతిష్ఠాపన ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు తాటికొండ రాజేందర్ కోరారు. ఈ మేరకు శనివారం కమిటీ సభ్యులతో కలిసి పనులు పరిశీలించారు. గ్రామస్తులు, దాతల సహకారంతో పునర్నిమిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ఈనెల 19, 20, 21 తేదీల్లో పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ శ్రీరాంరెడ్డి, కమిటీ సభ్యులు భద్రయ్య, శ్యామ్, అశోక్, భిక్షపతి, శంకర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

తనిఖీ బృందానికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయులు

హన్మకొండ (పరకాల) : 15వ విడత సామాజిక తనిఖీ బృందానికి ఈజీఎస్ సిబ్బంది సహకరించాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు కోరారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను చూపించాలని సూచించారు. సామాజిక తనిఖీ నిర్వహించేందుకు బృందం, పంచాయతీ కార్యదర్శులతో శనివారం సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టిన అన్ని పనులను రికార్డు చేయాలన్నారు. తనిఖీ బృందం సభ్యులు కూలీలకు డబ్బులు చెల్లించారా.. లేదా అనే విషయం తెలుసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎస్ఆర్‌పీ చెన్నకేశవులు, ఏపీఓ ఇందిర, ఈసీ రాజేశ్, డీఆర్‌పీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు సిబ్బంది పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ



ఎస్సై సమక్షంలో లెక్కిస్తున్న విరాళాలు

ఐనవోలు : కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు ఆస్తి నష్టం జరిగి ఇబ్బందులు పడుతున్న బాధితులకు విరాళాలు సేకరించినట్లు సీపీఎం మండల కమిటీ నాయకులు తెలిపారు. శనివారం వరకు సేకరించిన విరాళాలను స్థానిక ఎస్సై శ్రీనివాస్ సమక్షంలో లెక్కించగా రూ. 8,260 పోగు అయినట్లు సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి బొట్ల చక్రపాణి తెలిపారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ విరాళాల సేకరణకు ప్రతిఒక్కరూ సహకరించాలని మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కొంకాల నారాయణరెడ్డి, మాదాసి యాకూబ్, కుంకాల కవిత, నాయకులు మడిగె నాగరాజు, బొమ్మకంటి యాకయ్య, మాదాసి ప్రభాకర్, నంద కిశోర్‌తో పాటు సీపీఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నూతన చట్టంలో కఠిన శిక్షలు



అవగాహన కల్పిస్తున్న సీఐ నాగబాబు

కేయూ క్యాంపస్: ట్రాఫిక్ నూతన చట్టంలో కఠినమైన శిక్షలు ఉంటాయని కాజీపేట ట్రాఫిక్ కంట్రోల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగబాబు అన్నారు. లైసెన్స్ లేకున్నా, వాహనానికి ఇన్సూరెన్స్ లేకున్నా, రాంగ్ రూట్‌లో ప్రయాణం చేసినా, సిగ్నల్ జంప్ చేసినా నూతన చట్టం ప్రకారం వాహనాదారులకు శిక్ష పడుతుందని హెచ్చరించారు. కాకతీయ యూనివర్సిటీలో ఎన్‌సీసీ పదవ బెటాలియన్ (తెలంగాణ) ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కేడెట్లకు కాకతీయ యూనివర్సిటీలో క్యాంపు కొనసాగుతోంది. ఈ సందర్భంగా వారికి ట్రాఫిక్ నిబంధనలపై నాగబాబు అవగాహన కల్పించారు. ట్రిపుల్ రైడింగ్ చేయడం నేరమని, లైసెన్స్ లేకుండా వాహనం నడపకూడదని, వాహన యజమానులు పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని, హెల్మెట్ లేకుండా బైక్ నడపరాదని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాంపు కల్నల్ రామదురై, లెఫ్టినెంట్ కల్నల్ రవిసునేరి, కెప్టెన్ డాక్టర్ సతీష్‌కుమార్, కెప్టెన్ డాక్టర్ సదానందం, సుబేదారి మేజర్ సుహాస్కందం, లెఫ్టినెంట్ గణేష్, సెకండ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, కెప్టెన్ డాక్టర్ సబిత బాలురెడ్డి, శాంతి, సుజిత, సీత, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

వివస్త్రను చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించారు



నినాదాలు చేస్తున్న ఐద్వా నాయకులు

కాశిబుగ్గ: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన దళిత మహిళ సునీతను వివస్త్రను చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించిన సీఐపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధితురాలుకు న్యాయం చేయాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. ఏసిరెడ్డినగర్ సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రత్నమాల మాట్లాడారు. బంగారం దొంగతనం పేరిట దళిత మహిళ సునీతను నాగేందర్ కుటుంబ సభ్యులు చిత్రహింసలు చేయడమే కాకుండా షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. దాంతో షాద్‌నగర్ పోలీసులు రాత్రి 8గంటల సమయంలో మహిళా పోలీసులు లేకుండానే సునీతను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించి వివస్త్రను చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో ఐద్వా నాయకులు సంగీత, భవాని, ఉదయశ్రీ, మంజుల, వాణి, జరీన, రాధక్క తదితరులు పాల్గొన్నారు.

600 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

ఐనవోలు : ప్రజలకు చెందాల్సిన పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసి తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు నిఘా పెట్టి పట్టుకున్నారు. వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు ఏసీపీ మధుసూదన్ ఆధ్వర్యంలో మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గల బాలాజీ రైస్ మిల్‌లో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, జఫర్‌ఘడ్ పోలీసులు శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు రూ.15 లక్షల 60వేలు విలువచేసే 600 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సమాచారం. ఈ విషయమై జఫర్‌ఘడ్ ఎస్సై రాంచరణ్‌ను వివరణ కోరగా.. రైస్ మిల్ సీజ్ చేశామని, పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

సంజయ్‌కుమార్‌కు డాక్టరేట్



హన్మకొండ (పరకాల): పరకాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న నడికూడ గ్రామానికి చెందిన దుప్పటి సంజయ్‌కుమార్‌కు డాక్టరేట్ వరించింది. చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్ విభాగంలో 'డెవలపింగ్ సిస్టమ్ విచ్ లర్న్ నేమ్స్ ఫ్రమ్ డిఫరెంట్ లాంగ్వేజెస్ బై రేకాగ్నైజింగ్ దెం' అనే అంశంపై ప్రొఫెసర్ రమేశ్‌బాబు పర్యవేక్షణలో సంజయ్‌కుమార్ పరిశోధన చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ సీ.హెచ్ పురుషోత్తంరెడ్డి డాక్టరేట్ ప్రదానం చేశారు. చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డి, రీసర్చ్ డీన్ ఆచార్యా టి.క్రిస్టోఫర్, పబ్లిక్ రిలేషన్ అధికారి రాంబాబు, రిజిస్ట్రార్ ఆచార్య, అధ్యాపకులు అభినందించారు.

మంద సురేశ్ సస్పెన్షన్

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన మంద సురేశ్‌ను భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ నియమ నిబంధనలకు విరుద్ధంగా, వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు సురేశ్‌ను సంఘం నుంచి తొలగిస్తున్నట్లు వెల్లడించారు. సురేశ్‌కు డీవైఎఫ్ఐకి సంబంధం లేదని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆత్మకూరు : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ మండల ప్రధానకార్యదర్శి బయ్య పైడి ఆచార్య బూత్ స్థాయి కార్యకర్తకు సూచించారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. కేంద్రం నిధులతోనే ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయన్నారు. రోడ్ల నిర్మాణం, ఆహార పంపిణీ పథకం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే కొనసాగుతున్నాయని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ కార్యకర్తలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, కష్టపడిన ప్రతీ ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని అన్నారు.

'సహృదయం'తో చేరదీసి..



వృద్ధురాలిని వృద్ధాశ్రమానికి తీసుకెళ్తున్న యాకూబీ, నిర్వాహకులు

ఎల్కతుర్తి : మండలంలోని పెంచికలపేట బస్టాండ్ ఆవరణలో నివాసముంటున్న ఓ అనాథ వృద్ధురాలిని హనుమకొండ సహృదయ అనాథ ఆశ్రమం నిర్వాహకులు చేరదీశారు. గుర్తుతెలియని వృద్ధురాలు కొన్ని రోజులుగా బస్టాండ్‌లోనే ఉంటూ స్థానికులు ఇచ్చిన ఆహారాన్ని తింటూ జీవిస్తోంది. గమనించిన స్థానికులు సహృదయ వృద్ధాశ్రమం నిర్వాహకులకు సమాచారం అందించారు. స్పందించిన వృద్ధాశ్రమ నిర్వాహకులు యాకూబి శనివారం అక్కడికి చేరుకుని వృద్ధురాలికి ఆహారం తినిపించారు. ఆమె వివరాలు ఆరా తీయగా ఏలాంటి సమాచారం లభించలేదు. దీంతో ఆటోలో వృద్ధాశ్రమానికి తీసుకెళ్లారు. ఇకపై వృద్ధురాలి యోగక్షేమాలన్నీ తామే చూసుకుంటామని యాకూబీ తెలిపారు. కాగా వృద్ధురాలును చేరదీసిన సహృదయ వృద్ధాశ్రమ నిర్వహకులకు స్థానికులు, పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జ్ సెక్రటరీగా సాల్మన్‌రాజు

కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్ కాలనీ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జ్ సెక్రటరీగా సాల్మన్‌రాజు నియమితులయ్యారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ భీష్మదేవ్ జూలై 31వ తేదీన రిటైర్డ్ అయ్యారు. ఆయన స్థానంలో డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈ వెంకటకుమార్ ఆదేశాలనుసారం డీజిల్‌షెడ్‌లో సీనియర్ సెక్షన్ ఇంజనీర్‌గా పని చేస్తూ జాయింట్ సెక్రటరీగా కొనసాగుతున్న సాల్మన్‌రాజును నియమించారు. ఈమేరకు మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్ సమక్షంలో సాల్మన్‌రాజు శనివారం ఇన్‌చార్జ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్.కె.జానీమియా, సెక్రటరీ పి.వేదప్రకాశ్, ట్రెజరర్ జి.రాజేశ్వర్, ఆఫీస్ బేరర్స్ యాదగిరి, ఎ.సత్యనారాయణ, నరేశ్ యాదవ్, నాగరాజు, భాస్కర్ రెడ్డి, పలు ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.